# ముసిరిన చీకట్లు



శ్రీమతి జి. భవానీకృష్ణమూర్తి

**ఆ**కాశం నల్లటి ముసుగు వేసుకున్నట్లు దట్టంగా అలుముకున్నాయి కారు మబ్బులు. ఉరుములు, మెరుపులతో వాతావరణం భయపెడుతోంది.

సెకండ్‌క్లాసు కంపార్టుమెంటులో ఉన్న రాజారావు సీటుమీద అసహనంగా కదిలాడు. కిటికీ తలుపులుమూసినా చలిగాలి రివ్వున కొడుతోంది. కాళ్ళు రెండు పైకి లాక్కుని ముడుచుకుని కూర్చున్నాడు. అయినా చలి వణికిస్తూనే ఉంది.

"ఛ! ఈ వెధవ ముసురు నా ప్రయాణం రోజునే ఎక్కువ అవ్వాలా? ఇంటిదగ్గర ఉంటే హాయిగా గాయత్రి కౌగిట్లో వెచ్చగా పడుకునేవాడిని" భార్య కౌగిట్లోని సుఖాన్ని నెమరువేసుకొంటూ, చలిని తరిమికొట్టడానికి ప్రయత్నిస్తున్నాడు.

గాలి బలంగా కిటికీ అద్దాలమీద మొత్తుకుంటోంది. రైలు రొదతోపాటు గాలి గోలకూడా తోడైంది. ఆ శబ్దానికి చెవులు చిల్లులు పడుతున్నాయి. మధ్యాహ్నం మూడుగంటలే అయినా రాత్రి అయినట్లు చీకటి పడిపోయింది.

క్రమంగా సన్నని జల్లు మొదలైంది. గాలి విసురుకి వానజల్లు కిటికీ సందుల్లోనుంచి లోపలికి పడుతోంది. ఆ సన్నని నీటితుంపరకి ఒళ్ళు జలదరిస్తోంది.

ఏదో చిన్న స్టేషనులో ఆగింది రైలు తలుపు తెరవగానే గాలీ, వానా ఒక్కుమ్మడిగా దాడిచేశాయి. దిగేవాళ్ళు దిగారు. ఎక్కేవాళ్ళు ఎక్కారు. రైలు కదిలింది. తలుపులు మూతపడ్డాయి. ఎక్కిన నలుగురైదుగురు నీళ్ళోసుకుంటూ తలుపు దగ్గర, టాయ్‌లెట్‌కి

వెళ్ళేదారిలోను నిలబడ్డారు. రాజారావుకి ఒక మనిషి మాత్రమే కనిపిస్తోంది. ముప్ఫది కాటోలు అనుకున్నాడు. వాయిలు చీర తడిసి ఒంటికి అంటుకుపోయింది. అక్కడక్కడ చిరిగిపోయిందేమో శరీర వంపులన్నీ స్పష్టంగా కనిపిస్తూ చూప రుల గుండెల్లో కోర్కెను రేపుతున్నాయి. పీచులా ఉన్న జుట్టు తడిసి నీళ్లోడు తోంది. స్నానం చేసి చాలా రోజు లైందన్నట్లు గుర్తుగా శరీరం మట్టి మట్టిగా, జిడ్డుగా ఉంది. ఆమెను పరీక్షగా చూస్తూ కూర్చున్న రాజారావు ఆ ముఖంలో ఏవో పోలికలు గుర్తించి ఉలిక్కిపడ్డాడు.

'జలజ!' పదిహేను సంవత్సరాల తరువాత జలజని ఈ స్థితిలో చూడాల్సి వస్తుందనుకోలేదు. గుండె ఒక్కసారి పైకెగతన్నుకొచ్చి గొంతులో అడ్డు పడ్డట్టు ఉక్కిరిబిక్కిరి అయ్యాడు ఒక్క క్షణం.

ఆమె తనని గుర్తుపట్టిందో లేదో! పట్టకుండా ఉంటే బాగుండును. నైన్‌టీ పర్సెంట్ గుర్తుపట్టలేదు. ఎందుకంటే తనకి అప్పటికంటే బాగా ఒళ్ళొచ్చింది. అప్పుడు సన్నగా గీతలా ఉండే మీసం తనతోపాటే లావై గుబురుగా ఉండేలా సంరక్షణ చేస్తున్నాడు. అప్పటి నొక్కు నొక్కుల జుట్టు అంతా ఊడిపోయి బట్టతల అయింది. రెండు కళ్ళు నాలుగు కళ్ళు అయ్యాయి. పదేళ్ళ తరువాత మొన్న గోపాలం కలిసినప్పుడు పలక రిస్తే అసలు గుర్తే పట్టలేకపోయాడు. నేను రాజారావునిరా అంటే ఆశ్చర్యంగా చూసి, అప్పుడు కౌగలించుకున్నాడు. అటువంటిది పదిహేను సంవత్సరాల క్రితం చూసిన జలజ తనని గుర్తుపట్ట గలదా? ఊహూ! ముమ్మాటికీ గుర్తుపట్ట లేదు. అలా అనుకున్నాక నిశ్చింతగా అనిపించింది రాజారావుకి.

గాలి, వాన మరికాస్త ఉధృతం అయ్యాయి. అయినా చలి సంగతి మరచి పోయి అతని మనసు పదిహేను సంవ త్సరాల వెనక్కి పరుగెత్తింది. మరి కాస్త ముడుచుకుని కూర్చుని తన మనసు వేగాన్ని అందుకోడానికి ప్రయ త్నించసాగాడు రాజారావు.

* * *

లింగమూర్తిగారు టౌనులో హై స్కూలు హెడ్మాస్టారు. తాయారమ్మ ఆయన భార్య. పల్లెలో స్వంతఇల్లు, కొద్దిపాటి పొలం ఉన్నాయి. కూతురు గాయత్రి. పల్లెలోనే మకాం ఉంటూ సైకిలుమీద రోజూ టౌనుకి వెళ్ళి డ్యూటీ ముగించుకుని తిరిగి సాయంకాలం ఇంటికి వచ్చేవాడు. తాయారమ్మ చెల్లెలు, మరిది ప్రమాదవశాత్తూ చనిపోతే వారి బిడ్డ జలజను తన దగ్గర ఉంచుకుని ఆలనాపాలనా చూడసాగింది తాయారమ్మ.

గాయత్రి, జలజ స్వంత అక్క చెల్లెళ్ళకంటే అన్యోన్యంగా ఉంటూ

ఆడుతూ పాడుతూ పెరిగి పెద్దవారు అయ్యారు.

రాజారావు ప్రేమలో పడింది గాయత్రి. రాజారావు తలిదండ్రులు కట్నం ఎక్కువ అడిగినా, కాదని కూతురి మనసు నొప్పించడం ఇష్టంలేక, ఉన్న ఊళ్ళోనే ఉంటే కూతురు తమ కళ్ళముందే ఉంటుందని భావించి, పొలం అమ్మేసి రాజారావుతో కూతురి పెళ్ళి జరిపించేశాడు లింగమూర్తి. గాయత్రి అత్తవారింటికి వెళ్ళింది.

జలజ వంటరిదైంది. ప్రతిరోజూ పక్కవీధిలో ఉన్న గాయత్రి ఇంటికి వెళ్ళి కాసేపు కబుర్లుచెప్పి వస్తేగానీ తోచేది కాదు ఆమెకి.

లింగమూర్తి హఠాత్తుగా గుండెపోటు వచ్చి మరణించాడు. భర్త వియోగం భరించలేక మంచంపట్టింది తాయారమ్మ. సంపాదించేతండ్రి లేడు. తల్లి మంచంలో ఉంది మందులకి, తిండికి గడవక ఇంటరు పూర్తి అవగానే చదువుకి స్వస్తి చెప్పి ప్రైమరీస్కూలులో టీచరుగా జాయినయ్యింది జలజ, వాళ్ళనీ, వీళ్ళనీ పట్టుకుని.

తండ్రి చనిపోయాక ఆయన వ్రాసిన విల్లులో తాయారమ్మ తదనంతరం ఉన్న ఇల్లు జలజకి గాయత్రికి చెరిసగం వాటాలుగా పంచుకునేటట్లు, బ్యాంకులో ఉన్న పదివేల రొక్కం జలజ పెళ్ళి నిమిత్తం ఖర్చులకి వ్రాయడం చూసి తాయారమ్మ సంతోషించినా, గాయత్రికి ఆమె భర్త రాజారావుకి భరింపరాని దయింది.

జలజని పరాయి పిల్లగా భావించలేదు తాయారమ్మ గానీ లింగమూర్తి గానీ. అందుకే ఆయన అలా వ్రాశాడు.


కన్నకూతురితోపాటు దిక్కులేనిపిల్ల జలజకి కూడా సమభాగం ఏమిటని గాయత్రి మనసులో విషబీజం నాటాడు రాజారావు. అది మొలకెత్తి ఇంతింతై వటుడంతై అన్నట్లు పెరిగి పెద్దదై పుష్పించి, ఫలించింది.

ఇల్లు పూర్తిగా తన పేర వ్రాసెయ్యమని ఒత్తిడి చెయ్యసాగింది గాయత్రి, జలజ స్కూలులో ఉన్న సమయంలో వచ్చి.

ససేమిరా అంగీకరించలేదు తాయారమ్మ.

తనతో ప్రాణానికి ప్రాణం అన్నట్లు మసిలే అక్క తనతో ముభావంగా, ముటముటలాడుతూ ఉండడం చూసి తనలో తనే బాధపడసాగింది జలజ. వాళ్ళింటికి వెళ్ళినప్పుడు రాజారావు కనుక ఉంటే లోపలికి రావద్దన్నట్లు భళ్ళున తలుపులు మూసేసేవాడు. తన ఇంటికి తాయారమ్మని చూడానికి వచ్చినప్పుడు పలకరిస్తే తప్ప తనంతట తాను మాట్లాడడం మానేసింది జలజ.

అసలు ఎందుకిలా జరుగుతోందో అర్థంకాక తన ప్రవర్తనలో ఏదైనా




లోపం ఉందేమోనని తరిచి చూసుకుంటూ ఉండేది. ఒక తల్లి కడుపున పుట్టక పోయినా ఒక తల్లి అనురాగాన్ని, ప్రేమనీ పంచుకుని పెరిగారు. ఇప్పుడెందు కిలా పురుగుని చూసినట్లు చూస్తోంది అక్క? తినేసేలా చూస్తాదెందుకు బావ? బాధ భరించలేక తాయారమ్మ గుండెల్లో ముఖం దాచుకుని "అమ్మా! నేనేం తప్పు చేశానని అక్క నన్నిలా ద్వేషిస్తోంది?" అంటూ ఏడ్చేసింది.

"నీమీద కోపం కాదు తల్లీ. నా మీద కోపం. మీ నాన్నమీద కోపం. నీ మీద చూపిస్తోంది అంతే."

"ఎందుకమ్మా?" తెల్లబోయింది.

"డబ్బే తల్లీ. డబ్బు ప్రేమల్ని కూడా చంపేస్తుంది." కన్నకూతురిపైనే కోపంతో రగిలిపోతోంది తాయారమ్మ మనస్సు.

"డబ్బేమిటి అమ్మా."

అప్పుడు తాయారమ్మ చెప్పేవరకూ ఇంటిలో సగం వాటాగానీ, బ్యాంకులో ఉన్న డబ్బుగానీ తనకి చెందేలా వ్రాశాడు లింగమూర్తి అని తెలియదు జలజకి

"అమ్మా! నాకే ఆస్తులు వద్దు. అమ్మ నాన్న చిన్నతనంలోనే చచ్చిపోయినా అక్కకంటే ఎక్కువగా నన్ను పెంచి, పెద్దచేశారు. నాకు మీ అభిమానం, ఆదరణ చాలమ్మా! అదే నాకు తరగని పెన్నిధి. మీ ఆశీస్సులే జీవితాంతంవరకూ నాకు రక్షణ నిచ్చే సంపద." అంటూ ఏడ్చేసింది.

"తల్లీ! అభిమానం కడుపు నింపదమ్మా. నీకు పెళ్ళిచేసి అత్తవారింటికి పంపడానికి మా ఆశీస్సులు ఒక్కటే చాలవు. నువ్వు మా బిడ్డవి కాదు అని నేనుగానీ, మీ నాన్నగానీ ఎప్పుడూ పొరపాటున కూడా అనుకోలేదు. మీ నాన్న

నిర్ణయాన్ని తలవంచి అమలుపరచడమే తప్ప ఎదురుచెప్పి కాదనే అలవాటు నాకు లేదు ఎప్పుడూ. నా కంఠంలో ప్రాణం ఉండగా వ్యతిరేకంగా ఎప్పుడూ చెయ్యను. నేను పోయాక అప్పుడు నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో. ఆయన కోరుకున్న విధంగా చేస్తే ఆయన మనసు, నా మనసు కూడా సంతోషిస్తాయి. ఆ తరువాత నీ ఇష్టం. దానికి మేమేమీ అన్యాయం చెయ్యలేదు. అయినా నామీద, నీమీద కక్షకట్టింది. కట్టనీ. కొన్నాళ్ళుపోతే అదే దాని తప్పు తెలుసుకుంటుంది." అంటూ జలజని ఓదార్చింది తాయారమ్మ.

మరి కొద్దిరోజులకే తాయారమ్మ మరణించింది. ఆస్తి వ్రాసివ్వలేదన్నకోపంతో అంత్యక్రియలు రాజారావు చెయ్యనంటే బ్రాహ్మణ్ణి మాట్లాడి యథావిధిగా జరిపించింది జలజ. తాయారమ్మ శవం ఉండగా వచ్చి కాస్సేపు ఉండి వెళ్ళిపోయారే తప్ప మళ్ళీ ఆ గుమ్మం ఎక్కలేదు గాయత్రి, రాజారావు.

ఒంటరితనం భరించలేక చాలా బాధపడింది జలజ. ఎక్కువసేపు స్కూల్లో పిల్లలతో గడుపుతూ కాలక్షేపం చేసేది, ఆ బాధ మరచిపోవడానికి.

* * *

గోదావరి నదికి వరదలు వచ్చాయి. ముసురుపట్టి నాలుగు రోజులనుంచి ఎడతెరిపిలేని వాన. మొదటిరోజున కురిసిన భారీవానకి స్కూలు గోడలు కూలిపోవడంతో స్కూలుకి శెలవులు ఇచ్చేశారు. వానలు తగ్గి ఆ గోడలు తిరిగి లేచే దాకా అంతే. ఇంట్లోనుంచి బయటికి అడుగుపెట్టడానికి కూడా వీల్లేని వాన, కుండలతో నీళ్ళు కుమ్మరిస్తున్నట్లు. అన్ని తలుపులూ మూసేసినా సందుల్లోనుంచి నీళ్ళు లోపలికొస్తూనే ఉన్నాయి. ఇల్లంతా తడితడి. మహా చిరాగ్గా అనిపించసాగింది జలజకి. మరో ప్రక్క ఒంటరితనం పిచ్చెక్కిస్తోంది. పుస్తకాలు చదివినవే చదివి విసుగొస్తోంది. చిన్నతనంలోనే పోయిన తల్లితండ్రి, లింగమూర్తి, తాయారమ్మ పదేపదే జ్ఞాపకం రాసాగారు. భవిష్యత్తు అస్తవ్యస్తంగా కన్పించసాగింది. మనస్సంతా వికలమై ఆ పూట భోజనం చెయ్యాలనిపించలేదు. చాలాసేపు ఏవేవో ఆలోచిస్తూ నిద్రపోయిన జలజకి వికృతమైన నవ్వు వినిపించి గబుక్కున మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచి చూసేసరికి ఎదురుగా రాజారావు. దిగ్గున లేచి కూర్చోబోయి కాళ్ళూచేతులు మంచానికి కట్టేసిఉండడంతో మళ్ళీ వెనక్కివాలిపోయింది. కట్లు విప్పుకోవాలని పెనుగులాడి విఫలురాలైంది జలజ.

"మర్యాదగా ఈ కాగితం మీద సంతకం పెట్టెయ్యి, వదిలేస్తాను" ఒక కాగితాన్ని ఆమెముందుంచాడు రాజారావు.

ఆస్తికోసం హీరోయిన్‌ని, ఆమెకి అతి ముఖ్యులైనవారిని బంధించి ఆస్తి తనపేర

ప్రాసి ఇవ్వమని హింసిస్తున్న విలన్ గుర్తొచ్చాడు.

"బావా! నన్నొదిలెయ్యి. నీకు కావలసింది సంతకమేనా? అలాగే పెడతాను." అంది గద్గదస్వరంతో.

"మీ నాన్న కోరుకున్న విధంగా చేస్తే ఆయన మనసు, నా మనసూ కూడా సంతోషిస్తాయి. ఆ తరువాత నీ ఇష్టం" తాయారమ్మ మాటలు గుర్తొచ్చాయి.

సంతకం చేస్తే వారి ఆత్మలు క్షోభిస్తాయి. చెయ్యకపోతే తన జీవితం బుగ్గిపాలు అవుతుంది. పోయినవాళ్ళు, వారి ఆత్మలు ఎలా ఉన్నాయో మనం చూడొచ్చామా? ఇప్పుడీ విషమ పరిస్థితినుంచి తప్పించుకోవాలి. అంతే అనుకుంది జలజ.

చేతులకి కట్లు విప్పేశాడు రాజారావు.

అతని చేతిలోనుంచి పెన్ను, కాగితం అందుకుని సంతకం చేసేసింది జలజ.

ఆ కాగితాన్ని జేబులో పెట్టుకుని అమాంతంగా ఆమెను వాటేసుకున్నాడు రాజారావు.

ఆ హఠాత్సంఘటనకి బిత్తరపోయింది జలజ.

"బావా! వదులు ప్లీజ్," విడిపించుకోవాలని పెనుగులాడింది.

"ఒంటరిగా చిక్కిన ఆడపిల్లని ఊరికే వదిలిపెట్టడానికి నేనేమీ చేతకాని చవటనికాదే!

"బావా! అక్కకి అన్యాయం చెయ్యకు. మరదలు అంటే చెల్లెలితో సమానం. వదులు బావా."

"పెళ్ళాం చెల్లెలు పెళ్ళామే అవుతుంది గానీ చెల్లెలెలా అవుతుందే. ఇందులో మీ అక్కకి జరిగే అన్యాయం ఏముందే? తెలిస్తే బాధపడుతుందేమో అనుకోడానికి అసలు ఇది మీ అక్క చెప్పిన సలహాయే" అన్నాడు పూర్తిగా ఆమెమీద వాలిపోతూ.

అతని పశుబలం ముందు పూర్తిగా ఓడిపోయింది జలజ.

అచేతనంగా, అస్తవ్యస్తంగా పడి ఉన్న ఆమెను చూసి కసిగా నవ్వుకుంటూ లేచి బయటకు నడిచి చీకట్లో కలిసిపోయాడు రాజారావ్.

* * *

రైలు ఒక్క కుదుపుతో ఆగేసరికి ముందుకు తూలిన రాజారావు ఆలోచనల నుంచి తేరుకున్నాడు. ప్రాణభయంతో అరుస్తున్నవాడిలా గట్టిగా కూతపెట్టింది రైలు. వర్షపుహోరులో చిత్రంగా, వికృతంగా వినిపిస్తోంది ఆ ధ్వని.

ఆ తరువాత జలజని ఇంట్లోనుంచి గెంటేసి ఇల్లు అమ్మేసి, భార్య గాయత్రితో సహా వేరే ఊరు వెళ్ళిపోయాడు.

తల తిప్పి జలజవైపు చూశాడు రాజారావు. ముడుచుకుని మోకాళ్ళమీద గడ్డం ఆన్చుకుని కూర్చుని ఉంది. చలికి గజగజా వణుకుతోంది. ఒక్కసారిగా ఆమె

మీద చెప్పలేనంత జాలివేసింది రాజా రావుకి. కానీ, అభిమానం అడ్డొచ్చి ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

రైలు కదిలి ఉయ్యాలలా ఊగుతూ ముందుకి సాగింది. దానితోపాటే తన ఆలోచనలూ ముందుకి సాగాయి. ఆ ఇల్లు అమ్మిన డబ్బుతో విజయనగరంలో తను మరొక ఇల్లు కొన్నాడు. కానీ ఆ యింట్లో అడుగుపెట్టినప్పటినుంచీ తనకి అన్నీ అరిష్టాలే. ఇద్దరు పిల్లలు పుట్టి పోయారు. గాయత్రికి ఎప్పుడూ ఏదో ఒక అనారోగ్యమే. ఆమెతో జీవితం సంతృప్తికరంగా అనిపించక బయటి రుచులు మరిగి తను అనారోగ్యం కొని తెచ్చుకున్నాడు రాజారావు. ఆతనిమీద అనుమానంతో గాయత్రి సాధింపు, వాటిని తప్పించుకోడానికి బయట తిరుగుతూ త్రాగుడుకూడా అలవాటు చేసుకున్నాడు. సకలగుణాభిరాముడు అయ్యాడు. భార్య అంటే అసహ్యం, ఇల్లు అంటే ఏవగింపు.

తన పరిస్థితి చూసి తనకే ఏడుపు వచ్చేది గాయత్రికి. భర్త నిరాదరణ, ఒంటరితనం, అనారోగ్యం తనకి శాపాల్లా అనిపించేవి. తల్లి, తండ్రి, జలజ గుర్తొచ్చేవారు. వెక్కి వెక్కి ఏడ్చేది.

జలజ, తను గడిపిన రోజులు తీయని కలలా, చెరగని మధురస్మృతిలా అనిపించేవి.

తన ప్రాణానికి ప్రాణం అన్నట్లుండే జలజకి తనెలా అన్యాయం చెయ్యగలి గింది? భర్తయొక్క డబ్బు ఆశ తనని ఆ స్థితికి దిగజార్చింది. ఉచ్ఛనీచాలు మరచిపోయేలా, ఆత్మీయతానురాగాలు హరింపచేసి కసాయిదానిగా మార్చింది. ఫలితం ఇప్పుడు అనుభవిస్తోంది. తనకి శాస్తి జరగాల్సిందే.

"అమ్మా! నువ్వెన్ని చెప్పినా వినక, జలజకి అన్యాయం చేశాను. కన్నతల్లిని ఉసురుపెట్టిన కారణంగా నేను తల్లిని అయ్యే యోగ్యత లేకుండా చేశాడా భగవంతుడు. అమ్మా! నన్ను క్షమించు అమ్మా. అమ్మా! జలజ ఎక్కడున్నా నా దగ్గరకు వచ్చేలా చెయ్యమ్మా. నువ్వు చెప్తే అది తప్పకుండా వింటుందమ్మా. నువ్వన్నా, నేనన్నా దానికి ప్రాణం. దాని జీవితం ముక్కలు చింపిన విస్తరి అయ్యేలా చేసిన పాపాత్మురాలిని. నన్ను క్షమించమ్మా. కంటికీ మింటికీ ఏక ధారగా ఒకటే ఏడుపు.

దిక్కులు పిక్కటిల్లే ధ్వని రాజా రావు ఆలోచనలకి అంతరాయం కలి గించింది.

మరుక్షణంలో ఏం జరిగిందో అతనికి తెలియదు.

* * *

వర్షాలకి పట్టాలు పక్కకి తప్పు కోవడంతో రైలు పక్కకి పడిపోయింది. ఒకప్రక్క వాన హోరు, మరొకప్రక్క




ప్రయాణీకుల హాహాకారాలు, ఆక్రందనలు. చావుకేకలు. రణరంగంలా తయారైంది ఆ ప్రదేశం. వర్షపు నీరంతా నెత్తురులా వరదలై పారుతోంది. చుట్టూ నిర్జనప్రదేశం. బ్రతికి బయట పడినవాళ్ళు కొందరు అధికారులకి కబురు పంపే ప్రయత్నాలు చెయ్యసాగారు. చుట్టూ చిమ్మచీకటి. హోరుగాలివల్ల, కుండపోతగా కురిసే వర్షంవల్ల ఏమీ సాధ్యం కావడంలేదు. చేసేదిలేక పక్కకి ఒరిగిపోయిఉన్న రైలుపెట్టెల్లోనే దూరి ముడుచుకుని కూర్చున్నారు, ఆ చీకట్లోనే తడుముకుంటూ వెళ్ళి

అర్ధరాత్రి దాటాక వర్షం కాస్త తగ్గుముఖం పట్టింది. మబ్బులు విడి ఆకాశం కాస్త వెలుతురు పులుముకుంది.

మూలుగులు, ఆక్రందనలు బలహీనమయ్యాయి. లోపల కూర్చున్నవాళ్ళు బయటికి వచ్చి రైలుక్రింద పడిపోయిన వాళ్ళని అలాగే వదిలేసి, సందుల్లో ఇరుక్కున్నవాళ్ళని, ప్రాణం ఉందనిపించిన వాళ్ళని బయటికి తీసి, కొంచెం ఎత్తుగా రాళ్ళగుట్టలా ఉన్న ప్రదేశంలో పడుకోబెట్టడం మొదలుపెట్టారు.

"అబ్బా! అమ్మా ... ఊ!" మూలుగుతూ కదిలాడు రాజారావు. ఒంట్లోని ఎముకలన్నీ కలుక్కుమన్నాయి. ప్రాణం గిల్లార్చుకుపోతున్నట్లు అనిపించి బాధగా మూల్గాడు.

"బా-వా!.... ఊ!" చేత్తో అతన్ని తడుముతూ పిలిచింది జలజ. ఆ స్పర్శకి పూర్తిగా స్పృహవచ్చింది రాజారావుకి.

అ చేతిని అందుకుందామని చేతిని పైకి ఎత్తబోయి సాధ్యంకాక, బాధగా మూల్గుతూ, మెల్లిగా తలతిప్పి "ఊః.... ఎవరూః" అన్నాడు.

"నే....ను...., జలజను.... బావా"

"జలజాః"

"ఊః"

"దెబ్బలు బాగా.... తగిలాయాః"

"ఇంక.... నా పని.... అయిపోయింది.... బావా. నీతో.... రెండు మాటలు.... మాట్లాడడం.... కోసమే ప్రాణాలుగ్గబట్టు....కుని.... ఉన్నాను. . ఇందాకటినుంచీ.... అబ్బాః"

"జలజాః"

"ఇప్పటికైనా నామీది కోపం.... తగ్గితే.... రెండు కన్నీటిబొట్లు విడవమని.... నా మాటగా.... అక్కయ్యకి .... చెప్పు.... బావా."

"జలజాః.... నన్ను.... నన్ను క్షమించు" చచ్చుపడిపోయి రక్తపు ముద్దలా ఉన్న తన చేతిని బలవంతంగా పైకెత్తి అమె చేతిమీద వేశాడు రాజారావు.

"హుంః.... నేనంత గొప్పదాన్ని.... అర్హత.... కలిగినదాన్నీ కాదు బావా.... ఊః.... అబ్బాః...."

"పక్క స్టేషనుకి... కబురెళ్ళిందట. కాస్సేపు ఓర్చుకో జలజాః"

"లేదు.... నాలాంటి.... పతిత, భ్రష్టురాలు.... బ్రతకకూడదు.... బావా...."

"నా మూలంగానే నువ్వు.... నువ్విలా అయ్యావు జలజా.... నువ్వు .... బ్రతకాలి.... నాతో తీసికెడతాను .... నిన్ను చూసి.... మీ అక్క ఎంత సంతోషిస్తుందో తెలుసాః"

"ఉహుం! నాకు.... బ్రతకాలని లేదు .... బావాః నాలాంటి పాపిష్టివాళ్ళని తుడిచిపెట్టుకుపోవడానికే ప్రకృతి ఒక్కొక్కసారి ఇలా.... విలయ తాండవం చేస్తూంటుంది."

"అయితే.... నేనూ.... నీలాగే...."

"వద్దు బావా.... అలా అనకు.... నువ్వు లేనిదే.... అక్క జీవితం.... లేదు.... అక్క జీవచ్ఛవం కాకూడదు బావా." నూతిలోంచి వస్తూన్నట్లుంది అమె గొంతు.

ప్రమాదవార్త అందగానే రక్షకదళం సిబ్బంది, అంబులెన్సులు, డాక్టర్ల బృందం అ ప్రదేశం చేరుకున్నారు. ప్రథమచికిత్స చేసి అంబులెన్సులలో చేర్చి గవర్నమెంటు అసుపత్రికి తరలించారు గాయపడినవారందరినీ. యంత్ర సహాయంతో రైలుపెట్టెలను పక్కకి తొలగించి దాని క్రిందపడి నలిగి నామరూపాలు లేకుండాపోయిన శవాల్ని బయటికి తీశారు.

* * *

రాజారావుకి అపరేషన్‌చేసి నజ్జునజ్జు

అయిపోయిన చేతిని పూర్తిగా తీసివేశారు. అతనికి స్పృహరాగానే జలజ గురించి అక్కడతిరిగే నర్సులని అడిగాడు. మరు నాడు గానీ జలజ చనిపోయిందన్న వార్త తెలియలేదు. రైల్వే సిబ్బంది ఇచ్చిన టెలిగ్రాం చూసుకుని గుండె అరచేత పట్టుకుని ఏడుస్తూ వచ్చింది గాయత్రి.

భర్తని ఆ స్థితిలో చూస్తుంటే దుఃఖం ఆగలేదు ఆమెకి.



"ఊరుకో గాయత్రీ! నాకేం కాలే దుగా" ఊరడించి, "గాయత్రీ! జలజ.... కనిపించింది" అన్నాడు.

"జలజా! ..మా చెల్లి..ఎక్కడంది!"

"రాత్రి.... నిన్న రాత్రి.... చచ్చి పోయిందట గాయత్రీ!"

"చెల్లీ! నీకు చేసిన అన్యాయానికి నన్ను క్షమించకుండానే వెళ్ళిపోయా వామ్మా!" దోసిట్లో ముఖం దాచుకుని

వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది గాయత్రి.

"జలజకి నీ మీద కోపం లేదు, గాయత్రీ. బావా నువ్వు బ్రతకాలి. మా అక్క జీవచ్ఛవం కాకూడదు అంటూ కలవరించింది తెలుసా!"

"అయ్యో.. నీదెంత మంచి మనసమ్మా. నా పాపానికి నిష్కృతి లేదమ్మా." జుట్టు పీక్కుంది.

ఆసుపత్రి అధికారుల అనుమతి తీసుకుని జలజశవానికి తనే దహనసంస్కారాలు చేశాడు రాజారావు.

నాలుకలు సాచి పైపైకి వస్తున్న ఆ మంటల్లోనుంచి "బావా! నాలాంటి పతితురాలు, భ్రష్టురాలు ఈ భూమ్మీద బ్రతక్కూడదు. నాలాంటి పాపిష్టివాళ్ళని తుడిచిపెట్టుకుపోడానికే ప్రకృతి ఒకొక్కసారి ఇలా విలయతాండవం చేస్తూఉంటుంది." జలజ గొంతు ప్రతిధ్వనిస్తూన్నట్లు అన్పించసాగింది రాజారావుకి.

పాపిష్టిదానివి నువ్వు కాదు జలజా. నిన్ను ఆ స్థితికి దిగజార్చిన నేను పాపిష్టివాడిని. అప్పట్లో డబ్బుమీద నాకున్న వ్యామోహం పాపిష్టిది. మంచిచెడులు ఆలోచించని నా మనస్సు పాపిష్టిది. నేను చెప్పిన కల్లబొల్లి కబుర్లు నమ్మి నీ జీవితాన్ని నాశనం చెయ్యాలన్న నా కోరికని ప్రోత్సహించిన మీ అక్కయ్య దుర్బుద్ధి పాపిష్టిది. ఒక ఆడకూతురుకి అన్యాయం జరిగితే అయ్యో ఇదేమిటని అడగని ఈ సంఘం పాపిష్టిది. బలవంతంగా చెరచబడ్డ ఒక ఆడదాన్ని గౌరవించని, నిలువనీడ ఇవ్వని, మనిషిగా బ్రతుకనివ్వని ఈ సమాజం పాపిష్టిది." అనుకున్నాడు బాధగా.

దుఃఖోద్వేగంతో నిలబడలేక భర్తని ఆనుకుని నిలబడింది గాయత్రి. జలజ చితవైపు నిస్తేజంగా, నిర్లిప్తంగా చూస్తున్న భర్త గుండెల్లో అగ్నిపర్వతాలు బ్రద్ధలవుతున్నాయన్న సంగతి ఆమెకు తెలుసు. ఆమె మనసు కూడా కాలుతున్న చితిలాగే అనిపించసాగింది గాయత్రికి.

వారి హృదయవేదన తగ్గేది కాదని తెలిసినా చితిమంటల్ని చల్లార్చడానికి అన్నట్లు, అంతవరకూ ఆగిన వర్షం మళ్ళీ మొదలైంది.

ఆ వర్షం ఉధృతం అయ్యేవరకూ చాలాసేపు అక్కడే నిల్చుండిపోయారు రాజారావు, గాయత్రి. కారుమబ్బులు కమ్ముకోవటంవల్ల చిరుచీకట్లు ముసురుతున్నాయి.

